క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాలు, తండాలకు సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ నాగరాజు తెలిపారు. మండల కేంద్రంతో పాటు గాజుల కుంటతండా, మెట్లకుంట, తుంకిమెట్ల, బొట్లోనితండా, దేవులానాయక్‌తండా, ఏర్పుమళ్ల, చౌదర్‌పల్లి క్రషర్ సర్వీసులకు ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అనంతగిరిలో..

అనంతగిరి: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా వికారాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధుకాలనీ, గంగారం, రైల్వే స్టేషన్ రోడ్డు, ఐటీఐ కళాశాల, సుభాష్‌నగర్, పోస్టాఫీస్, ఎఫ్‌సీ, నవరంగ్ బట్టల దుకాణం దగ్గర, హనుమాన్ మందిరం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్ల పొదల తొలగింపు నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

కుల్కచర్ల: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం మండల కేంద్రం శ్రీరామలింగేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. ఫస్టియర్‌లో 45 మంది పరీక్ష రాయగా, ఒకేషనల్‌లో 11 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 25 మందికి 22 మంది పరీక్ష రాశారని, ఒకేషనల్ పరీక్ష రాయాల్సిన విద్యార్థి ఒకరు ఆబ్సెంట్ అయినట్లు ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు.

దుస్తులు సిద్ధం చేయండి



మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

దౌల్తాబాద్: పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరికీ యూనిఫాం అందించాలని, అందుకు త్వరితగతిన దుస్తులు సిద్ధం చేయాలని ఎంఈఓ వెంకటయ్య ఐకేపీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రం మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని ఎంఈఓ సందర్శించారు. ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించారు. దుస్తుల తయారీకి ఏర్పాటు చేసిన బృందాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఆర్‌పీ నారాయణ ఉన్నారు.

సీసీ వేశారు.. సైడ్లు మరిచారు



సైడ్లలో మట్టిపోయని మోత్కుర్ సీసీరోడ్డు

దోమ: గ్రామీణ ప్రాంతాల రహదారులను మెరుగు పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా పల్లెల్లోని ప్రతి వీధిలో చూడచక్కని సీసీరోడ్లు రూపుదిద్దుకుంటున్నాయి. కానీ నిర్మాణదారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు పూర్తయినా.. సైడ్ల ఊసులేకుండా పోయింది. దీంతో ప్రాంత ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి మోత్కుర్, దిర్సంపల్లి, పాలేపల్లి, ఐనాపూర్, శివారెడ్డిపల్లి, బొంపల్లి తదితర గ్రామాల్లో కాంట్రాక్టర్లు సీసీలను నిర్మించారు. కానీ సైడ్లకు మట్టి పోయకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సైడ్లకు మట్టి పోయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మందుబాబులకు వినూత్న శిక్ష

తాండూరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు తాండూరు కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నామాల అశోక్ శుక్రవారం వినూత్న శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనం నడిపిన తాండూరు పట్టణానికి చెందిన యూసుఫ్, సమీర్‌లను మజీదు వద్ద కూర్చున్న పేదలకు పండ్లు, నగదు దానం చేయాలని, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇద్దరూ పలువురికి పండ్లు పంపిణీ చేశారు.

సాగుకు సన్నద్ధం



పెంట కుప్పలోంచి ఎరువును తరలిస్తున్న రైతులు

వానాకాలం పంటలకు కర్షకులు సమాయత్తం
- సేంద్రియ ఎరువులను పంట పొలాలకు తరలిస్తున్న రైతులు
- ట్రాక్టర్ ఎరువుకు రూ.3వేలు చెల్లించి కొనుగోలు

ధారూరు: ఖరీఫ్ సీజన్ (వానాకాలం) సమీపిస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. సేంద్రియ ఎరువులను తమ పంట పొలాలకు తరలిస్తున్నారు. పశువుల ఎరువుతో పాటు మేకలు, గొర్రెల ఎరువును సైతం వినియోగిస్తున్నారు. పశు సంపద లేని రైతులు.. ట్రాక్టర్‌కు రూ.3 చెల్లించి, కావాల్సినంత సహజ ఎరువును కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు అన్నదాతలు మాట్లాడుతూ.. సహజ సిద్ధమైన ఎరువులతో భూసారం పెరుగుతుందని, తద్వారా దిగుబడి అధికంగా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

పొలం పనుల్లో బిజీబిజీ

రబీలో సాగుచేసిన కంది, పత్తి తదితర పంటల సేకరణ అనంతరం.. పొలాల వైపు వెళ్లని రైతులు.. ప్రస్తుతం దుక్కులు దున్ని పొలాల్లో పేరుకుపోయిన పత్తి, కంది కొయ్యలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కంది, పత్తి, మినుము, పెసర, పసుపు తదితర పంటలను సాగుచేసేందుకు తమ పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తె నుంచి విత్తనాలు విత్తేందుకు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, డీఏపీ, యూరియా, పొటాష్ లాంటి రసాయనిక ఎరువులను సైతం సిద్ధంగా ఉంచుకున్నారు.

కిలో ఎరువుకు రూ.5



డంపింగ్ యార్డ్‌లో సిద్ధంగా ఉన్న ఎరువు

కుల్కచర్ల: సేంద్రియ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కుల్కచర్ల మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్‌ను ఆయన సందర్శించి, సహజసిద్ధమైన ఎరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. యార్డ్‌లో ఎనిమిది క్వింటాళ్ల ఎరువు సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైన రైతులు కిలో ఎరువుకు రూ.5 చెల్లించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ ఎరువు ద్వారా భూసారం పెరిగి, పంటలను ఎంతో పుష్టిగా ఉంచుతుందని, తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పే

- వాడితే కఠిన చర్యలు
- మున్సిపల్ అధికారుల హెచ్చరిక
- పలు దుకాణాల తనిఖీ



జరిమాన రసీదు అందజేస్తున్న అధికారులు

పరిగి: నిషేధిత ప్లాస్టిక్ వాడటం వలన పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, తద్వారా సగటు జీవి మనుగడ ప్రశ్నార్థమవుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను వాడిన వారిని గుర్తించి జరిమాన విధించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని, 75 మైక్రాన్‌ల కన్నా తక్కువగా ఉన్న వాటిని వినియోగించడం చట్ట విరుద్ధమని చెప్పారు. ప్లాస్టిక్‌ను వాడటం కానీ విక్రయించడం కానీ నేరమన్నారు. మొదటి సారి పట్టుబడితే నామమాత్రపు జరిమానాతో సరిపెడతామని, ఆ తరువాత భారీగా జరిమానా విధించడంతో పాటు, కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడమని హెచ్చరించారు.

గురుకులానికి ముగ్గురు విద్యార్థుల ఎంపిక



ఎ.శ్రీహరి



జి.ఆదిత్యప్రసాద్



జి.సాయివరుణ్

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధి పాత కొడంగల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని హెచ్ఎం క్రాంతికుమార్ తెలిపారు. 5వ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో సెకండ్ ఫేస్‌లో ఎ.శ్రీహరి బీసీ వెల్ఫేర్ ఉప్పల్ బాలుర మేడిపల్లి మేడ్చల్‌కు, జి.ఆదిత్యప్రసాద్, జి.సాయి వరుణ్‌లు తాండూరు మైనార్టీ గురుకులాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పాఠశాల నుంచి ముగ్గురు గురుకులాలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

చేతిలో పైసలు ఉన్నాయి.. రుణం చెల్లించండి

- రుణభారం తగ్గించుకోండి
- రైతులకు విజ్ఞప్తి చేస్తున్న పీఏసీఎస్ సిబ్బంది



పీఏసీఎస్ కేంద్రం

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధి రైతులు తీసుకున్న దీర్ఘ కాలిక రుణాల బకాయిలను వసూలు చేసేందుకు పీఏసీఎస్ సీఈఓ, సిబ్బంది సిద్ధమయ్యారు. బలవంతపు వసూళ్లకు పాల్పడకుండా, నచ్చజెప్పి వసూలు చేస్తున్నారు. 'రబీ పంటలు చేతికి వచ్చాయి. చేతిలో డబ్బులు ఉన్నాయి. రుణం తాలూకు బకాయి చెల్లించండి' అంటూ రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతే కాకుండా.. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ లభించడంతో పాటు రుణభారం తగ్గుతుందని కర్షకులకు సూచిస్తున్నారు. లేని పక్షంలో మిత్తి పెరిగి, ఆర్థిక భారం పడుతుందని రైతులకు వివరిస్తున్నారు.

ఎల్‌టీ రుణాలు చెల్లించండి: సీఈఓ

ధారూరు పీఏసీఎస్ పరిధి రైతులకు ఇప్పటి వరకు రూ.8.08 కోట్లు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామని సీఈఓ నర్సింలు తెలిపారు. ఇంతవరకు వారి నుంచి రూ.3 కోట్ల 97లక్షల 69వేలు వసూలు చేశామని, ఇంకా రూ.4,10,31,000ల బకాయిలను వసూలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి, ఇతర రైతులకు ఎల్‌టీ రుణాలు ఇచ్చేందుకు సహకరించాలని సీఈఓ రైతులను కోరారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

బంట్వారం: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎంపీపీ ప్రభాకర్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మతతత్వ పార్టీ బీజేపీని ప్రజలు ఎన్నికల్లో ఆదరించలేదని, సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిందని, కేంద్రంలో ఉంటే రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. దీనిని గుర్తించిన ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌ను ఆదరించారని, అదే కాంగ్రెస్‌ను గెలిపిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ధాన్యం త్వరగా కొనండి

కొడంగల్ రూరల్: రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తహసీల్దార్ బి.విజయకుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధి అప్పాయిపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులను సమస్యలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

విరబూసిన 'మే'పుష్పం



పెరట్లో వికసించిన పువ్వు

ధారూరు: మండల కేంద్రంలోని మహ్మద్ బాబాఖాన్ ఇంటి పెరట్లో మే నెల పుష్పం శుక్రవారం వికసించింది. ఏడాదికి ఒకసారి పూసే ఈ అరుదైన జాతి పుష్పాన్ని చూడటానికి స్థానికులు ఆసక్తి చూపారు. ఈ పువ్వు 12 రోజుల పాటు కనువిందు చేయనుందని, ఆ తర్వాత రాలిపోతుందని ఖాన్ తెలిపారు.

ఘనంగా నృసింహుడి జాతర



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పూడూరు: మండల పరిధిలోని రాకంచర్ల యోగానందా లక్ష్మీనర్సింహా స్వామి జాతర ఘనంగా జరుగుతోంది. శుక్రవారం స్వామి వారిని కోటి దీపోత్సవంతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు రఘు రామాచారి, సేతుమాచారి, నర్సింహాచారి, భీమాచార్యులు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఉత్సవ నిర్వాహకులు డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా.. శనివారం సహస్ర బిల్వార్చన, ఆదివారం స్వామివారి చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య



ఉన్నత పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఈ

మర్పల్లి: మనఊరు–మనబడి కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌కు సూచించారు. మండల కేంద్రంలోని ఉర్దు మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన తరగతి గదుల మరమ్మతు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి వసతి తదితర పనులను పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శ్రావణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలని తాపీ మేస్త్రీలకు సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని ఏఈ తెలిపారు. ఎంపీడీఓ వెంట ఏకేపీ ఏపీఎం మధుకర్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభం

ఉద్యానశాఖ అధికారి అశోక్

షాబాద్: ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే రైతులకు అధిక లాభం చేకూరుతుందని చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి వి. అశోక్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధి తాళ్లపల్లి రైతు వేదికలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను, మిగతా పంటలతో పోల్చితే వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆయిల్ పామ్‌కు సంబంధించి అనుకూల నేలలు, నీటి లభ్యత, నాటువిధానంపై సాగు నీటి యాజమాన్యం ఎరువుల వినియోగం, అంతర పంటలు, గెలల దిగుబడి, కోతలకు సంబంధిచిన వివరాలు రైతులకు వివరించామని వెల్లడించారు. నీరు తేలికగా ఇంకిపోయే గుణం ఉన్న నేలలు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. సాగునీరు సమృద్ధిగా ఉండాలని, 9 మీటర్ల దూరం ఉండేలా త్రిభుజాకారం లేదా చతురస్రాకార పద్ధతిలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. రైతులు అందుబాటులో ఉన్న ఆయిల్‌పామ్ ఫీల్డ్‌ఆఫీసర్‌కు, ఏఈఓకు, హార్టికల్చర్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గీతా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే.. లక్ష్యం మనదే



విద్యార్థులతో అధ్యాపకబృందం

- విద్యార్థులు సామాజిక స్పృహను అలవర్చుకోండి
- వీడ్కోలు సమావేశంలో కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్

తాండూరు టౌన్: లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా బుద్ధులతో పాటు సామాజిక స్పృహ, నైతిక విలువలు, క్రమశిక్షణను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అనునిత్యం పరితపించాలని, శ్రమ, పట్టుదల, కృషి ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూపతి రెడ్డి, అధ్యాపకులు బసంత్, శ్రీనివాస్ యాదవ్, వెంకట్, అమిత్, కల్పన, మన్నన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులూ.. జర జాగ్రత్త

- విత్తనాల కొనుగోలులో జరభద్రం
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- తాండూరు ఏడీఏ రుద్రమూర్తి



ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

కొడంగల్ రూరల్: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు భద్రంగా ఉండాలని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఏడీఏ తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలని దుకాణ దారులకు చెప్పారు. ఈ సందర్భంగా విత్తనాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులకు సలహాలు, సూచనలు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసి, బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. సంబంధిత బిల్లులతో పాటు విత్తన ప్యాకెట్‌ను పంట కాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్యాకెట్లు కాకుండా.. విడిగా(లూజు) విత్తనాలను కొనరాదని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల ద్వారానే సరకులు కొనుగోలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు పొందేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలను రైతులకు అందజేస్తున్న వ్యవసాయ అధికారి తులసి

చేవెళ్ల: 60శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి తులసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతేడాది కంటే ఈ సంవత్సరం అధికంగా తెప్పించినట్లు పేర్కొన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొని, రైతు వేదికల వద్ద ఏఈఓలను కలిసి పర్మిట్ రాయించుకోవాలని సూచించారు. స్టాక్ ఉన్నంత వరకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. అవసరం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్మిట్‌లు ఒక చోట విత్తనాలు మరోచోట

వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువు విత్తనాల పంపిణీ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. విత్తనాలు ఒక చోట పర్మిట్‌లు మరోచోట పెట్టడంతో వాటిని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముడిమ్యాల పీఏసీఎస్ గోదాం వద్ద మండలానికి కావాల్సిన జనుము, జీలుగ విత్తనాలను అందుబాటులోకి తెచ్చి, వాటిని అధికారులు రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు వారివారి రైతువేదికల వద్ద ఉన్న ఏఈఓల వద్ద విత్తనాలకోసం పర్మిట్లను రాయించుకొని ముడిమ్యాల వద్ద విత్తనాలను తీసుకెళ్లారు. వాహనాలు లేని రైతులు ఒక బస్తా విత్తనాలకోసం ముడిమ్యాల పీఏసీఎస్ వరకు వచ్చేందుకు రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు. రైతు వేదికల వద్దనే ఈ విత్తనాలను అందుబాటులో ఉంచితే బాగుండేదని రైతులు అభిప్రాయబడ్డారు. ఈ విషయంలో వ్యవసాధికారులు స్పందించి, రైతులకు అందుబాటులో పంపిణీ చేయాలని కోరారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజేశ్ డిమాండ్



మాట్లాడుతున్న పీడీఎస్‌యు నాయకులు

చేవెళ్ల: పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన విద్యార్థి సంఘం నాయకుడిపై దాడి చేసిన పోలీస్ కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రాజేశ్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో శుక్రవారం తాండూరు పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి సంఘం నాయకుడిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. అనంతరం మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాల్సింది పోయి పోలీసులే ఇబ్బందులకు గురిచేయటం బాధాకరమన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలో పోలీసుల తీరుపై ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయన్నారు. దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆ భూమిని పేదలకు కేటాయించండి



షాద్‌నగర్ ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రాకేశ్

కేశంపేట: సర్కారిపట్టా, పోరంబోకుగా ఉన్న రికార్డులను తారుమారు చేసి పట్టాభూమిగా మార్చిన ప్రభుత్వ భూముల రికార్డులను పునఃపరిశీలించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధి దత్తాయపల్లి రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 27లో 3ఎకరాల 16గుంటల భూమి పలు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైనట్టు పేర్కొన్నారు. ఈ భూమిని గ్రామానికి చెందిన కొందరు రికార్డులను తారుమారు చేసి పట్టా భూమిగా మార్చి విక్రయించారని ఆరోపించారు. మళ్లీ ఆ భూమిని అమ్మేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. గతంలో అదే సర్వే నంబర్‌లో పాత ఊరు ఉండేదని, రికార్డుల్లో చింతల సర్కారి భూమిగా నమోదైనట్టు ఆయన వివరించారు. ఈ భూమి విషయంలో పాత రికార్డులను మళ్లీ పరిశీలించి, కబ్జాదారుల నుంచి విడిపించాలని కోరారు. గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకోసం ఆ భూమిని కేటాయించాలన్నారు. ఆర్డీఓకు వినతి పత్రం అందజేసిన వారిలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోకన్వీనర్ నర్సింహ్మా, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.